

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 282 ఎడిటర్: కె.యువరాజ్ గురువారం 23-7-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు


## తోడ్పాటునివ్వండి!

- కీలక బిల్లులు గట్టెక్కాలి - లోక్‌సభలో మరింత మద్దతు కావాలి - పలు పార్టీలతో చర్చలు జరుపుతున్నాం - చంద్రబాబుతో భేటీలో ప్రధాని వెల్లడి! - ఆగస్టు 10లోగా రాజ్యాంగ సవరణకు ఆమోదం! - 'భోగాపురం' ప్రారంభానికి మోదీకి ఆహ్వానం



**న్యూఢిల్లీ, జులై 22 (వన్‌నేషన్):** నీట్ పేపర్ లీక్ వివాదం... 'కాక్రోచ్' ఆందోళనలు... పార్లమెంటులో, బయటా విపక్షాల నిరసనల వేడి.... ఇవన్నీ ఎలా ఉన్నా సరే! ఈ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులకు ఆమోదం పొందాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల పునర్ విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులు గట్టెక్కేలా వ్యూహ రచన చేస్తున్నట్లు సమాచారం. దీనిపై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రధాని కీలక చర్చలు జరిపారు. ఆగస్టు 1న భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించాల్సిందిగా చంద్రబాబు ప్రధానిని ఆహ్వానించారు. ఇదే సమయంలో కీలక బిల్లుల ఆమోదంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించేందుకు అవలంబించాల్సిన వ్యూహంపై దాదాపు 40 నిమిషాలు ముఖాముఖి చర్చలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... "కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన, ప్రతిపక్షాల నిరసనలు త్వరలో సద్దుమణుగుతాయి. అది పెద్ద రాజకీయ సమస్య కాదు. పరిస్థితి పూర్తిగా

2లో

## గాంధీ, గాడ్సే వారసుల మధ్య పోరు

- ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి - లేదంటే తెలంగాణ నుంచే 'సడక్ సే సంసద్' పోరాటం - రాహుల్, ప్రియాంకపై దాడి చేయించిన కేంద్రం - కొడంగల్‌లో కాంగ్రెస్ నిరసనలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు - బీఎల్‌ఏలతో సమీక్షలో సీఎం.. సర్ ఫారం బీఎల్‌వోకు అందజేత




**కొడంగల్, జులై 22 (వన్‌నేషన్):** నీట్ ప్రశ్నపత్రాలను లీక్ చేసి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర క్యాబినెట్ నుంచి ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే 'సడక్ సే సంసద్' వరకు పోరాటాన్ని తెలంగాణ నుంచే ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును అణచివేసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో పాశవిక దాడి చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పోరాటం కాంగ్రెస్, బీజేపీ మధ్య కాదని, గాంధీ వారసులకు, గాడ్సే వారసులకు మధ్య జరుగుతున్న పోరాటమని అన్నారు. రాహుల్, ప్రియాంకపై పోలీసుల దాడి, అరెస్టును నిరసిస్తూ బుధవారం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ, ధర్నాలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీట్ ప్రశ్నపత్రాలను కోట్ల రూపాయలకు విక్రయించి విద్యార్థుల జీవితాలను చీకటిమయం చేశారని ఆరోపించారు. ఇదుకు ధ ర్మేంద్ర ప్రధాన్‌ను, నిందితులను జైల్లో పెట్టాల్సిందిపోయి.. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న

2లో

## కాంగ్రెస్, బీజేపీ.. ఢీ అంటే ఢీ

- పరస్పరం పార్టీ కార్యాలయాల ముట్టడి - తొలుత గాంధీభవన్‌కు వెళ్లిన బీజేపీ నేతలు - ఫ్లెక్సీలు చించివేస్తుండగా అడ్డుకున్న పోలీసులు - ప్రతిగా బీజేపీ ఆఫీసు ముట్టడికి కాంగ్రెస్ యత్నం - కరీంనగర్‌లో సంజయ్ కార్యాలయ ముట్టడికి యత్నం - చెప్పులు, కుర్చీలు విసురుకున్న ఇరు పార్టీల నాయకులు - ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాల్సిందే: మహేశ్‌గౌడ్



**హైదరాబాద్, జులై 22 (వన్‌నేషన్):** నీట్ నిరసనల సెగ.. కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర కార్యాలయాలకూ తాకింది. ఆయా పార్టీల నేతలు పరస్పరం పార్టీల రాష్ట్ర కార్యాలయాలను ముట్టడికి దిగడం.. తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోటాపోటీ నిరసనలు, నినాదాలతో హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రాంతం హోరెత్తింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలకు దిగారు. మీరెంత అంటే మీరెంత అన్నట్లుగా ఒకరిపైకి మరొకరు దూసుకుపోయారు. ఒకానొక దశలో కర్రలు, రాళ్లతో దాడులు చేసుకోగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు.. నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో యువతపై లాఠీచార్జి, రాహుల్‌గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో లోక్ భవన్ కార్యక్రమంలోనూ ఉద్రిక్తత చోటు చేసుకుంది. లోక్‌భవన్ లోపలికి వెళ్లేందుకు యత్నించిన

4లో

## తాగునీటి ఎద్దడికి చెక్ పెడదాం

- పల్నాడు-ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పనులు - వేగవంతం చేయండి.. ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం - పనుల నాణ్యతను స్వయంగా పరిశీలిస్తా - ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష



**అమరావతి, జులై 22 (వన్‌నేషన్):** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నందున రాష్ట్రవ్యాప్తంగా అధిక ప్రాంతాలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే అవకాశం ఉందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. బుధవారం పల్నాడు-ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో ఆయన సమీక్షించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే పల్నాడు, ప్రకాశం లాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. జల్‌జీవన్ మిషన్, అమరజీవి జలధార పథకంలో భాగంగా ఈ ప్రాంతాల్లో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనులు నిర్ణీత గడువులోగా పూర్తికావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు. రెండు మెగా ప్రాజెక్టుల అంచనా వ్యయం దాదాపు రూ.2,500 కోట్లు. అనంతరం పవన్ మాట్లాడుతూ పల్నాడు, ప్రకాశం ప్రాంతాల్లో

3లో


వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా?





బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?

అయితే రండి...

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

## భారతీయ వైద్య పరంపర సంస్థను సందర్శించిన

# సెయింట్ మేరీస్ కళాశాలకు బి ఫార్మసీ వైద్య విద్యార్థులు



ఎల్బీనగర్, జులై 22 (వన్‌నేషన్): సెయింట్ మేరీస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్- హైదరాబాద్. యాదాద్రి జిల్లా. పోచంపల్లి మండలం. దేశ్‌ముఖి గ్రామం నుండి డాక్టర్ రవి కుమార్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రియాంక అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో ద్వితీయ సంవత్సర 44 మంది బి ఫార్మసీ వైద్య విద్యార్థులు, విద్యా పరిశోధనాత్మక పర్యటన (Educational & Research Oriented Visit) కార్యక్రమంలో భాగంగా ఆయుర్వేద వైద్య ఉన్నతిని అవగాహన చేసుకోని ప్రేరణ పొందే నిమిత్తం గడ్డిఅన్నారంలో ఉన్న జాతీయ భారతీయ వైద్య పరంపర సంస్థను సంధర్శించినారు. డాక్టర్ G.P. ప్రసాద్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ సంస్థ గురించి , సంస్థ ద్వార వైద్యవిద్యార్థుల సేవలో వినియోగమవుతున్న అనేక ఆన్‌లైన్ పోర్టల్‌లు (NAMSTE, SAHI, AMAR, E- Medha, RMIS) గురించి తెలియజేసారు. సంస్థలో జరుగుతున్న వివిధ పరిశోధనా కార్యక్రమాలను గురించి పరిశోధక అధికారులు విద్యార్థిని విద్యార్థులుకు విపులంగా వివరించారు. ఔషధాల చరిత్రపై అవగాహన: చీ××వీఃఅనేది భారతదేశపు ప్రాచీన వైద్య విధానాలు, ఆయుర్వేద చరిత్ర వైద్య వారసత్వాన్ని సంరక్షించే ఏకైక విశిష్ట సంస్థ. ఇక్కడికి రావడం ద్వారా విద్యార్థిని విద్యార్థులు మన దేశ సాంప్రదాయ వైద్య మూలాలను డాక్టర్ ౨. సాకేత్ రామ్ తెలియజేశారు. డాక్టర్ సంతోష్ మానే మాట్లాడుతూ సంస్థలో ఉన్న అరుదైన గ్రంథాలు- చరక సంహిత, సుశ్రుత సంహిత, బసవరాజీయం , అష్టాంగ సంగ్రహం మొదలైన గ్రంథాలలోని శ్లోకాలను విద్యార్థులకు తెలియజేసి వాటి యొక్క అంతరార్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులు భారతదేశపు సాంప్రదాయ వైద్య విధానాలు, ఆయుర్వేద పరిశోధనలు వైద్య రంగ చరిత్రకు సంబంధించిన విశేషాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఫార్మసీ రంగంలో పరిశోధనలకు ఈ పర్యటన ఎంతో దోహదపడుతుందని, విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని కళాశాల ఫార్మసీ విభాగాధిపతులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

చివరిగా సంస్థలోని గ్రంధాలయంలోని పురాతన గ్రంధాలు సంగ్రహాలయంలోని తాళ పత్ర గ్రంధాలు, వైద్య చికిత్స, చరిత్రకు సంబంధించిన విషయాలు గురించి విద్యార్థులుకు డాక్టర్ అక్షయ్, కె. శ్రీనివాసరావు – లైబ్రేరియన్, మరియు వర్ష కుమారి లైబ్రేరియన్, వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, (రీసెర్చ్ ఆఫీసర్ – ఆయుర్వేద), డాక్టర్ బిశ్వరరజన్ దాస్ (రీసెర్చ్ ఆఫీసర్ – హోమియోపతి), (రీసెర్చ్ ఆఫీసర్ – ఆయుర్వేద), డాక్టర్ అష్ఫాక్ అహ్మద్ (యునాని) సంస్థ సిబ్బంది, పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి

## బోగారం సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్



యాదాద్రిజిల్లా: రామన్నపేట జులై 22 (వన్ నేషన్) : రామన్నపేట మండలం బోగారం గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ పాల్గొని బీఎల్ఏలు, బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఏలు, బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు, తప్పులు లేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, నిర్దేశిత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భోగారం ఉప సర్పంచ్ బైకానీ ఉమా మహేష్ యాదవ్,ఐదవ వార్డు మెంబర్ నేరటి మానస, సురేష్ యాదవ్,ఆరో వార్డు మెంబర్ కడారి పావని, పాపయ్య, బిఎల్ వో లు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# తోడ్పాటునివ్వండి!

(1వ పేజీ తరువాయి)

నియంత్రణలో ఉంది. వచ్చేవారం పార్లమెంటులో కొన్ని కీలక బిల్లులు ఆమోదం పొందుతాయి. ఆ తర్వాతి వారంలో కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించి... మహిళలు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న రిజర్వేషన్‌ను అమలు చేయాలని భావిస్తున్నాం” అని మోదీ చెప్పినట్లు తెలిసింది.

ఆగస్టు 1లోపే రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. రాజ్యసభలో బిల్లు ఆమోదానికి ఢోకా లేదని, లోక్‌సభలో కొంత సంఖ్యాబలం అవసరమని ప్రధాని చెప్పినట్లు సమాచారం. ఎన్‌సీపీ, డీఎంకేతో పాటు పలుపార్టీల నేతలతో సంప్రదిస్తున్నామంటూ... ‘మీరు కూడా దీనికి తోడ్పడాలి’ అని చంద్రబాబును కోరినట్లు తెలిసింది. తొలుత చంద్రబాబు, కేంద్రమంత్రి భూపతి వర్మ, పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీపీ నేత లావు కృష్ణదేవరాయ, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మోదీని కలుసుకున్నారు. కలిశెట్టిని చంద్రబాబు పరిచయం చేయబోగా... ‘ఆయనెందుకు తెలియదు, రోజూ పార్లమెంట్‌కు సైకిల్‌పై వస్తారు కదా! ఆయన క్రమశిక్షణే వేరు’ అని ప్రధాని ప్రశంసించారు.

## 25 నుంచి శిల్పకళావేదికలో

# అంతర్జాతీయ శాస్త్రీయ సంగీత నృత్య సదస్సు

**- స్వాతి సోమనాథ్ బృందంచే కామసూత్ర కూచిపూడి నృత్యరుపకం - నల్లాన్ చక్రవర్థుల మూర్తి, అలేఖ్య పుంజాల, కౌశికి చక్రవర్తి లకు విపంచి జీవన సాఫల్య పురస్కారాలు**






హైదరాబాద్, జులై 22 (వన్‌నేషన్): భారత శాస్త్రీయ సంగీత నృత్య కళలను ప్రోత్సహిస్తూ పరిరక్షిస్తూ పరివ్యాప్తి చేస్తున్న విపంచి సంస్థ దశమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 25వ తేదీ నుంచి రెండు రోజుల పాటు అంతర్జాతీయ స్థాయిలో భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని తెలిపారు. భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, ఒరిస్సా గవర్నర్ కె. హరిబాబు ఈ సదస్సును ప్రారంభిస్తారని ఆయన వివరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయా విశేషాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ప్రముఖ కూచిపూడి నాట్యగురు డాక్టర్ ఎస్.పి.భారతితో కలసి డాక్టర్ రాజారావు త్రిపురనేని సదస్సు బ్రోచర్ ను ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాలకు చెందిన సంగీత నృత్య కళాకారులు పాల్గొంటున్నారని మహీంద్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని తెలిపారు. రోజూ ఉదయం తొమ్మిది గంటలకు నాదస్వరంతో సదస్సు ప్రారంభమై రాత్రి 10 గంటలకు ప్రముఖ కళాకారుల నృత్య ప్రదర్శనలతో ముగుస్తాయని ఆయన వివరించారు. శనివారం ఉదయం పది గంటలకు జరిగే ప్రారంభ సదస్సులో ఎం. వెంకయ్యనాయుడు, గవర్నర్ కె.హరిబాబు, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉప సభాపతి కె. రఘురామ కృష్ణంరాజు, సీనియర్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎల్. వి. సుబ్రహ్మణ్యం, మహారాష్ట్ర తెలుగు సంఘం చైర్మన్ పుచ్చా వెంకటరమణ, మహీంద్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మేడూరి వెంకట సోమయాజులు, కాంటినెంటల్ కాఫీ ఎండి చల్లా రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొంటారు. కర్ణాటక సంగీతంలో టార్చ్ బేరర్ డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల మూర్తి, ప్రఖ్యాత హిందూస్థాని శాస్త్రీయ గాయని కౌశికి చక్రవర్తి, ప్రముఖ కూచిపూడి నర్తకీమణి ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య పుంజాల లను విపంచి జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరిస్తారు. సంగీత నృత్య అభినయ ఉపన్యాస సదస్సులో సెంట్రల్ యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య డాక్టర్ అనూరాధ జొన్నలగడ్డ, సితార విద్వాంసురాలు డాక్టర్ అనుపమ భగవత్, సంగీత దర్శకులు డాక్టర్ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం, పద్మశ్రీ దీపికారెడ్డి, డాక్టర్ కళాకృష్ణ, డాక్టర్ అయ్యగారి శ్యామ సుందర్, వయోలిన్ డాక్టర్ అశోక్ గుర్జాలే, డాక్టర్ రాఘవాచారి, డాక్టర్ రాజ్యలక్ష్మి సేథ్, డాక్టర్ రమాప్రభ యర్రమిల్లి, డాక్టర్ శైలజా దేశాయ్ (ముంబయి) తదితర ప్రముఖులు పాల్గొంటున్నారు. కళాపోషకులు మండవ ఆశాప్రియ, పద్మప్రియ కాసరనేని హాజరవుతున్నారు.

### తొలిరోజు సదస్సులో ‘కామసూత్ర’ నృత్య నాటకం

విపంచి అంతర్జాతీయ సదస్సులో తొలి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రముఖ నాట్య గురు డాక్టర్ స్వాతి సోమనాథ్ “సంప్రదాయం” శిష్య బృందం రచయిత బ్నిమ్ రచించిన కామసూత్ర నృత్య రూపకం ప్రదర్శిస్తారు. కాట్రగడ్డ హిమాన్షి, పద్మప్రియ అశాప్రియ నృత్య ప్రదర్శనలు, బెంగళూరుకు చెందిన అనుపమ భగవత్ సితార్ నాదం, పద్మజా విశ్వాస్ బృందం జానపద సంగీత ప్రదర్శనలు జరుగుతాయి. ముగింపు సదస్సులో మలేషియాకు చెందిన నర్తకీమణి గీతా గోవర్ధనం హజారే తన బృందంతో ఆంధ్ర నాట్యం ప్రదర్శిస్తారు. చెన్నై కు చెందిన ఉప్పలపు జయ విఘ్నేశ్వర్, పెద్ది రాజు బృందం మాండోలిన్ కచేరి, సత్యనారాయణన్ కృష్ణబాబు కీ బోర్డు విన్యాసం, బెంగళూరుకు చెందిన అర్చన మిశ్రా కథక్, సోనాలి మొహంతి ఒడిస్సి, హైదరాబాద్ కళాకారుడు హరి మంగళంపల్లి బృందం భరతనాట్య ప్రదర్శనలు ఉంటాయి. కళాప్రియులు, కళాకారులు, పరిశోధకులకు ఉచిత ప్రవేశం. కానీ, ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే టీ టిఫిన్లు, భోజన సౌకర్యం కల్పిస్తామని, ప్రత్యేక కిట్ అందిస్తామని, ఆసక్తిగలవారు విపంచి వెబ్ సైట్ లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డాక్టర్ రాజారావు త్రిపురనేని కోరారు. ముందస్తు రిజిస్ట్రేషన్ కోసం 98499 91499 నంబరు వాట్స్ యాప్ లోనూ సంప్రదించి సంబంధిత రిజిస్ట్రేషన్ లింక్ ను పొందవచ్చు.

# గాంధీ, గాడ్సే వారసుల మధ్య పోరు

విద్యార్థులపై, యువతపై పోలీసులు ప్రతాపం చూపించారని మండిపడ్డారు. ఆందోళన చేస్తున్న ఆడపిల్లల దుస్తులు చింపేసి.. వారిపై దాడి చేశారని, విద్యార్థుల తలలు పగులగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడం లేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియడం లేదని అన్నారు.

గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదు...

పోలీసులు జరిపిన పాశవిక దాడిలో రాహుల్‌గాంధీ రక్తం నేలపై చిందిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదని, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ తమ చివరి రక్తపుబొట్టు వరకు దేశం కోసమే జీవించారని తెలిపారు. పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. ప్రధాని పదవిని సోనియాగాంధీ త్యాగం చేశారని, ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, దేశాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ పరీక్షల అక్రమాలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి డిమాండ్ చేసినా.. కేంద్ర ప్రభుత్వం స్పీకర్‌పై ఒత్తిడి తెచ్చి చర్చ జరగకుండా అడ్డుకుందని ఆరోపించారు. మోదీని గద్దె దించి.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసుకునేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో కూడా 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని సీఎం రేవంత్ అన్నారు. ఆ సంస్థ చేసిన పొరపాట్ల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడ వారి పప్పులు ఉడకవని.. పేరు మార్చుకుని కేంద్రం వద్దకు వెళ్లిందని చెప్పారు. ఢిల్లీ బీజేపీ వారితో మాట్లాడుకుని ఆ సంస్థకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారన్నారు. అదే సంస్థ ఇప్పుడు కేంద్రంలోని సీబీఎస్ఈ పేపర్ల మూల్యాంకనంలో కూడా పొరపాట్లు చేసిందని, దీంతో ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ ను ఖండిస్తూ నిరసన తెలిపిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి**




**మహేశ్వరం, జులై 22, (వన్ నేషన్) :** రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ ను ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు




రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం జిల్లల్ గూడ గ్రామంలో రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ ను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే కేంద్ర ప్రభుత్వం పోలీసులు తోటి లాఠీచార్జి చేపించి దారుణమైన పరిస్థితి తీసుకొచ్చిందని దీనికి స్పందించి వెంటనే ప్రధానమంత్రి మోడీ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ పారిజాత నరసింహ రెడ్డి , మహేశ్వరం నియోజక వర్గం లోని మీర్ పేట్ డివిజన్ ప్రెసిడెంట్ చల్లా బాల్ రెడ్డి, జిల్లెలగూడ డివిజన్ ప్రెసిడెంట్ సిద్దాల శ్రీశైలం,ప్రశాంతి హిల్స్, డివిజన్ ప్రెసిడెంట్ ఏడుదొడ్ల సురేందర్ రెడ్డి ,నాదర్ గుల్,బడంగ్పేట్, బాలాపూర్, డివిజన్ అధ్యక్షులు జిల్లా సెక్రటరీ పైళ్ల శేఖర్ రెడ్డి జిల్లా నాయకులు మహిళా నాయకురాళ్లు డివిజన్ నాయకులు ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు, యువకులు పెద్దఎత్తున నిరసన తెలిపారు.

# నమస్తే ఎమ్మిగనూరు - ప్రజా సమస్యలపై 4వ రోజు పోరుబాట

**నమస్తే ఎమ్మిగనూరు -- ప్రజా సమస్యలపై పోరుబాట 4 వ రోజు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిరిసాల రాము గారి నివాసానికి ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారి మర్యాదపూర్వక భేటీ**



**ఎమ్మిగనూరు జూలై 22 MD యూసుఫ్ (వన్ నేషన్) :** నమస్తే ఎమ్మిగనూరు -- ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారు నేడు పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లిఅనంతరం ఎమ్మిగనూరు పట్టణం 2వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిరిసాల రాము గారి ఆహ్వానం మేరకు ఆయన స్వగృహానికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్న సిరిసాల రాము గారిని ఆప్యాయంగా కలుసుకుని, పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి గారు మాట్లాడుతూ, ప్రజలతో, నాయకులతో, కార్యకర్తలతో నిత్యం మమేకమవుతూ వారి కష్టసుఖాలను తెలుసుకోవడమే తన రాజకీయ ప్రయాణానికి బలమని అన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అందరినీ కలుపుకుని ముందుకు సాగే రాజకీయ సంస్కృతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని పేర్కొన్నారు.

ప్రజలతో నిరంతర అనుబంధాన్ని కొనసాగిస్తూ, నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం రాజీవ్ రెడ్డి గారు చేస్తున్న కృషి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజల ప్రశంసలను అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి మాచని వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య, మాజీ వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ రియాజ్ అహ్మద్, మాజీ స్టోర్స్ డైరెక్టర్ షబ్బీర్ అహ్మద్, పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.ఆర్. నటరాజ్ రెడ్డి, విశ్వనాథ్ రమేష్, చేనేత మల్లి, బంగి శ్రీరామ్, మాచని సోమేశ్, పంపయ్య, మాచని రఘు, వెంకటాపురం రాజు, సోమేశ్, దరాల శ్రీను, డిష్ కేశవ రెడ్డి, ఖాజా, డిష్ ప్రసాద్, ఎమ్మిగనూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ కేశన్న, పేట శ్రీనివాస్ రెడ్డి, ఎస్.కే. బాబూలాల్, చిన్నమరివీడు కృష్ణ, రాము, మధు, శివ, శ్రీను, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడికి చెక్ పెడదాం

(1వ పేజీ తరువాయి)

జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన అమరజీవి జలధార మెగా వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భుజం శస్త్రచికిత్స నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత పనుల పురోగతిని పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేపడతానని తెలిపారు. స్వయంగా పనుల నాణ్యతను పరిశీలిస్తానని, పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్ ఆధ్వర్యంలో

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



**యాదాద్రిజిల్లా: రామన్నపేట జూలై 22 (వన్ నేషన్):** రామన్నపేట లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ మాట్లాడుతూ ఢిల్లీలో విద్యార్థులు చేపడుతున్న నిరసన కార్యక్రమానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యార్థులపై విచక్షణ రహితంగా దాడి చేయడం ద్వారా వేలాది మంది విద్యార్థులు గాయపడిన సంఘటన చూసి ప్రధాన ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ పార్టీ అధినేత చలో పిఎం హౌస్ నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వగా శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేస్తున్న రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకు సమాధానం చెప్పలేక అటు విద్యార్థుల పైన దాడికి సమాధానం.చెప్పలేక,కుట్రపూరితంగా రాహుల్ గాంధీ పై దాడి చేయడం పిరికిపందల చర్య అని రాహుల్ గాంధీ కుటుంబానికి ఈ దేశం కోసం రక్తం చిందించడం వారి కుటుంబమే ఒక చరిత్ర అని గాంధీ నుంచి నేడు రాహుల్ గాంధీ వరకు ఈ దేశం కోసం రక్తం చిందించినవారు అని తెలుపుతూ. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధానమంత్రి మోడీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పట్టణంకాంగ్రెస్ అధ్యక్షుడు జమీరుద్దీన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, కొత్తపల్లి అబ్రహం కుమార్, ఉప సర్పంచ్ మోటే రమేష్, జినుకల ప్రభాకర్ రెడ్డి, సాల్వేర్ అశోక్, వనం చంద్రశేఖర్, మహమ్మద్ నాసర్, మహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్, మోటె మహేష్, మహమ్మద్ అంజాత్, కేశవ దాసు వెంకటేష్, మిర్జా అసలం బేగ్, నోముల ప్రవీణ్ కుమార్, మహమ్మద్ రిజ్వా న్,లెంకల ప్రవీణ్, మహమ్మద్ అజార్, బండ అంజిరెడ్డి, కొండ శేఖర్ గౌడ్, గడ్డం యాదగిరి, మీర్జా ఇనాయ తుల్లా బేగ్, చింతల కృష్ణ స్వామి, దామోదర్ రెడ్డి లవణం సాయి, ఎండి సమీర్, సైదాచారి,తదితరులు పాల్గొన్నారు.

# -డంపింగ్ యార్డు ఎత్తివేసేంతవరకు పోరాటం ఆగదు

**- జవహర్ నగర్ మాజీ ఉపసర్పంచ్, పోరాటకమిటి గౌరవ సలహాదారుడు రావల్ కోల్ నర్సింహ్మ గౌడ్ - నందమూరి నగర్ లో 26 న, డి.ఎన్.ఆర్.ఫంక్షన్ హాలులో డంపింగ్ యార్డు ఎత్తివేతకై జరిగే సదస్సును జయప్రదం చేయాలని 12 వ రోజు జరిగిన పాదాయాత్ర**




**జవహర్ నగర్ జూలై 22 (వన్ నేషన్):** జవహర్ నగర్ ప్రాణాలైన అర్పిస్తాంగానీ, డంపింగ్ యార్డు ఎత్తివేసేంతవరకు జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి ఆధ్యార్యంలో జరిగే పోరాటాలు మాత్రం ఆపబోమని జవహర్ నగర్ మాజీ ఉపసర్పంచ్, కమిటీ గౌరవ సలహాదారుడు రావల్ కోర్ నర్సింహ్మ గౌడ్ స్పష్టం చేశారు. 2026, జూలై-22 న, బుదవారం రోజు, కీసర సర్కిల్, జీహెచ్ఎంసీ, నందమూరి నగర్ లో 12 వ రోజు పాదయాత్ర జరిగింది. ఈసందర్భంగా డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాలను, వారి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న రాంకీ చెత్త డంపింగ్ తొలగింపు అవసరాన్ని గుర్తుచేశారు. సామాజిక బాధ్యతను గుర్తించి, ఎవరికి వారు స్వచ్ఛందంగా తమ బావిభారత పిలల్లకు మంచి సమాజాన్ని అందించాల్సిన అవసరాన్ని గుర్తించి, 26 న, ఆదివారం రోజు డి.ఎన్.ఆర్. ఫంక్షన్ హాలులో జరిగే పర్యావరణ, మేదావుల సదస్సును జయప్రదం చేయాలని కోరారు. చైర్మన్ షేక్ షావలి, కోశాధికారి, ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు, కో కన్వీనర్స్ సిపిఐ తోటపల్లి శంకర్, సిపిఎం శివన్నారాయణ, నగేష్, బహుజన సత్త, సర్పంచుల సంఘం నాయకులు బండకింది సింగరయ్య గౌడ్, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, పిఓడబ్ల్యూ జయసుధ, ఫాతిమా తదితరులు పాల్గోన్నారు.

## గర్భిణి మృతి ఘటనపై రేఖ నర్సింగ్ హోమ్, సంబంధిత వైద్యులపై కేసు నమోదు చేయాలని

# సీఐకి బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు



**ఎమ్మిగనూరు, జూలై 22 (వన్ నేషన్):** ఎమ్మిగనూరు టౌన్‌లో గర్భిణి జి. ఉరుకుందమ్మ మృతి ఘటనపై రేఖ నర్సింగ్ హోమ్ యాజమాన్యం, డాక్టర్ రేఖ, చికిత్సలో పాల్గొన్న వైద్యులు, నర్సులు మరియు సంబంధిత సిబ్బందిపై వైద్య నిర్లక్ష్యం ఆరోపణలతో తక్షణమే కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కనిగిరి రాముడు గారికి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. గర్భిణి మరణానికి దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయి విచారణ జరిపి, రేఖ నర్సింగ్ హోమ్‌లోని చికిత్స రికార్డులు, కేస్ షీట్లు, రిఫరల్ వివరాలు, అంబులెన్స్ రికార్డులు, సీసీటీవీ ఫుటేజ్ (ఉంటే) మరియు ఇతర సంబంధిత ఆధారాలను స్వాధీనం చేసుకుని, నిజానిజాలను వెలికితీయాలని వారు డిమాండ్ చేశారు. వైద్య నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రజాసంఘాల నాయకులు తమ సంఘీభావం ప్రకటించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని అదేవిధంగా భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని ఉన్నతాధికారులకు కలిసి స్వతంత్ర డాక్టర్స్ తో విచారణ చేపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రామతీర్థం అమ్రేష్, గడ్డం నాగేంద్ర, రాజేష్, నరసన్న, మాల నరసప్ప, లక్ష్మన్న, రఘు, గడ్డం హుసేని పాల్గొన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబ సభ్యులు మాదిగుండు ఈరన్న, సునీత, వీరమ్మ, చిన్న వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బాలబాలికలకే "శిశు వికాస్ యోజన "

## - వైద్య సాయం కోసం ఏడాదికి 25 వేలు గ్రాంట్ - ఉన్నత విద్య కోసం ఐదు లక్షల స్కాలర్షిప్




**తిరుపతి, జూలై 22 (వన్ నేషన్) :** బాల బాలికల సౌలభ్యం కోసం శిశు వికాస్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా ప్రతి పాఠశాలలో చదివే 16 ఏళ్ల లోపు విద్యార్థులకు ఆర్థిక సాయం అందించే బృహత్కర పదకమని రాష్ట్ర సూపర్వైజర్ పి వెంకటరమణ, జిల్లా కోఆర్డినేటర్ సుకుమార్ రాజు, రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత టి రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నుంచి 16 సంవత్సరాల మధ్య వయసు గల విద్యార్థులకు ఏడాదిలో చికిత్స కోసం 25 వేల గ్రాంట్ ను, ప్రాణ నష్టం కింద మూడు లక్షల నష్టపరిహారాన్ని పొందవచ్చును అన్నారు. విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఐదు లక్షల స్కాలర్షిప్ ను, 21 సంవత్సరముల దాటిన తర్వాత స్వయం ఉపాధి కింద పది లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని పొందవచ్చును అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ రవిని, వెంకటరమణ సుకుమార్ లు ఘనంగా సన్మానించారు.

# జర్నలిస్టుల సమస్యలపై 27న "ఛలో పార్లమెంట్"

## -జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా -పోస్టర్ ఆవిష్కరించిన టీడబ్ల్యూజేఎఫ్




**హైదరాబాద్, జులై 22 (వన్‌నేషన్):** కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై ఈ నెల 27వ తేదీన "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ హైదర్ గూడలోని న్యూస్ సర్వీస్ సిండికేట్(ఎన్ ఎస్ ఎస్) లో జరిగిన మీడియా సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు ఛలో పార్లమెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయడం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత వంటి డిమాండ్ల ను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ డిమాండ్ల సాధనకై 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన రైల్వే రాయితీని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్" ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాలలో అనేకమంది రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయయని, కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేకపోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదని,అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులు వంటి వాటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అదేవిధంగా పాత్రికేయ సంఘాలకు, జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నా అనంతరం పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.మీడియా సమావేశంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. పాండురంగారవు, పి. అశోక్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా కో-కన్వీనర్ నంబి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా 119వ వ్యవస్థాపక దినోత్సవాన్ని

# సామాజిక అభివృద్ధి మరియు సుస్థిరత కార్యక్రమాలు




**హైదరాబాద్, జులై 22 (వన్‌నేషన్):** భారతదేశపు ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా తన 119వ వ్యవస్థాపక దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా హైదరాబాద్ అంతటా సమాజ భాగస్వామ్యం మరియు సుస్థిరత కార్యక్రమాలతో జరుపుకున్నారు.

ఈ సంవత్సరం వ్యవస్థాపక దినోత్సవ థీమ్, "లీడింగ్ విత్ ట్రస్ట్ -- విశ్వాసంతో కలిసి ముందుకి నడిపించడం", నిజాయితీ, బాధ్యత మరియు కస్టమర్-కేంద్రీత సేవలు ఆధారంగా దీర్ఘకాలిక సంబంధాలను నిర్మించాలనే బ్యాంకు అచంచల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ వేడుకల్లో భాగంగా, బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క హైద్రాబాద్ జోన్, పర్యావరణ సుస్థిరత, ఉద్యోగుల స్వస్థత మరియు సమాజ నిమగ్నతకు తన నిబద్ధతను పునరు ద్ఘాటిస్తూ, వృక్షరోపణ కార్యక్రమం మరియు వాకథాన్ ని నిర్వహించింది. బ్యాంకు యొక్క " బాబ్ ఫారెస్ట్" కార్యక్రమం కింద, హైదరాబాద్ లోని యూసుఫ్ గూడలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు (టిజిఎస్ పి) 1వ బెటాలియన్ వద్ద వృక్షరోపణ కార్యక్రమం నిర్వహించబడింది, అక్కడ 1,119 మొక్కలు నాటారు. వృక్షరోపణ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా మరియు తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.




ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జోనల్ జనరల్ మేనేజర్ & జోనల్ హెడ్ శ్రీ ఎమ్.వి.ఎస్. సుధాకర్ గారు, శ్రీ ఆర్. మురళీకృష్ణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ (బిజినెస్ డెవలప్మెంట్), శ్రీ వి.ఎమ్.ఎన్.ఎస్. సాయి బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ (కంప్లయన్స్ & ఎష్యూరెన్స్), హైదరాబాద్ మెట్రో, తెలంగాణ ఉత్తర మరియు తెలంగాణ దక్షిణ ప్రాంతాల రీజనల్ మేనేజర్లు, శ్రీ పి.మురళీకృష్ణ, కమాండెంట్, శ్రీ సిహెచ్. సాంబ శివరావు, అడిషనల్ కమాండెంట్ ఉ శ్రీ బి. రామకృష్ణ, 1వ బెటాలియన్, టి జి ఎస్ పి అడిషనల్ కమాండెంట్ పాల్గొన్నారు. వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా, హైద్రాబాద్ జోన్ ఉద్యోగుల స్వస్థతను మరియు సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి వాకథాన్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) శ్రీ అవినాష్ కుమార్, హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్ ఉ జోనల్ హెడ్ శ్రీ ఎం.వి.ఎస్. సుధాకర్ ఈ వాకథాన్ను జెండా ఊపి ప్రారంభించారు. సంజీవయ్య పార్క్ నుంచి నెక్లెస్ రోడ్డు వరకు సాగిన ఈ మార్గంలో హైదరాబాద్ లోని బ్యాంకు శాఖలు, కార్యాలయాలకు చెందిన 200 మందికి పైగా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా తన విశిష్ట సేవలకు 119 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విశ్వాసం, శ్రద్ధ, నిజాయితీ మరియు కస్టమర్-కేంద్రీకృత విలువల పట్ల నిబద్ధత, అంకితభావంతో కొనసాగుతోంది. అలాగే సమాజ అభివృద్ధి కోసం అర్థవంతమైన సుస్థిరత కార్యక్రమాల ద్వారా సానుకూల ప్రభావాన్ని సృష్టిస్తూనే ఉంది.

# కాంగ్రెస్, బీజేపీ.. ఢీ అంటే ఢీ

(1వ పేజీ తరువాయి)

నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకోగా.. తోపులాట చోటు చేసుకుంది. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ నిరసనలు హోరెత్తాయి. బుధవారం ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకు ధర్నాలు, నిరసనలు, అరెస్టులతో రాష్ట్రం అట్టుడికింది. ఏఐసీసీ పిలుపు మేరకు టీసీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం చలో లోక్‌భవన్ కార్యక్రమం జరిగింది.

ఇదే సమయంలో రాహుల్‌గాంధీ తీరును నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నేతృత్వంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా గాంధీభవన్ ముట్టడికి వెళ్లి.. అక్కడ ఉన్న ఫ్లెక్సీలను చించివేశారు. రాంచందర్‌రావుతో సహా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. బీజేపీ నేతల గాంధీభవన్ ముట్టడికి సమాధానంగా ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వందలాది మంది బీజేపీ కార్యకర్తలు కర్రలు చేతపట్టుకొని కాంగ్రెస్ నాయకులను ఎదుర్కొనేందుకు ముందుకొచ్చారు. దీంతో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ఇరువర్గాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఒకరికొకరు కర్రలు చూపుకుంటూ, తొడలు కొట్టుకుంటూ సవాళ్లు విసురుకున్నారు. అనంతరం కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులకు దిగడంతో అరగంట పాటు ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. ఇరువర్గాలను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. ఈ గందరగోళంలో ఓ మీడియా చానల్ ప్రతినిధికి గాయం కాగా, సమీపంలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. వెంకట్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని, చిక్కడపల్లి పీఎ?సకు తరలించడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం వెంకట్ బల్మూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కూడా అహింస మార్గం వదిలి తిరగబడితే....బీజేపీ నేతలు రాష్ట్రంలో తిరగలేరని హెచ్చరించారు. అనంతరం గాంధీభవన్, బీజేపీ కార్యాలయాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు.. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి లోనికి అనుమతించారు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**